

నిండిపోయిన పొగ

- తారా స్థాయికి చేరిన కాలుష్య వాయువులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దీపావళి రోజు కర్నూలు నగరం పొగతో నిండిపోయింది. కాలుష్య వాయువులు సోమవారం తారా స్థాయికి చేరాయి. గాలి నాణ్యత భారీగా పడిపోయింది. గాలి నాణ్యతా సూచి (ఎక్యూఐ) 50 లోపు ఉండాల్సి ఉండగా దీపావళి రోజు సాయంత్రం 7 గంటలకు 277కు, 8 గంటలకు 321కు పెరిగింది. ఎక్యూఐ 300 దాటడం ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. గాలిలోని 2.5 ధూళి కణాలు (పిఎం 2.5) క్యూబిక్ మీటరుకు 30 మైక్రోగ్రాముల లోపు ఉండాల్సి ఉండగా సోమవారం సాయంత్రం 7 గంటలకు 135 మైక్రోగ్రాములుగా, 8 గంటలకు 152 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. పిఎం 2.5 కణాలు 121 మైక్రోగ్రాములు దాటినప్పుడు ఆ గాలిని పీల్చడం వల్ల శ్వాసకోశవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. గాలిలోని పిఎం 10 కణాలు క్యూబిక్ మీటరుకు 50 మైక్రోగ్రాముల లోపు ఉండాల్సి ఉండగా సోమవారం సాయంత్రం 7 గంటలకు 160 మైక్రో గ్రాములుగా, 8 గంటలకు 181 మైక్రో గ్రాములుగా నమోదయ్యాయి. పిఎం 10 కణాలు 101 నుంచి 250 మైక్రోగ్రాములు ఉన్న గాలి ఆస్తమా రోగులు, వృద్ధులు, చిన్నపిల్లల్లో శ్వాసకోశ ఇబ్బందులను కలిగిస్తాయని నిపుణులు అంటున్నారు. గాలిలోని నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్‌ఓ2) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రమాణాల ప్రకారం 13.29 పార్ట్స్ పర్ బిలియన్ (పిపిబి)లోపు ఉండాల్సి ఉండగా సోమవారం గాలిలో ఆ వాయువులు తారా స్థాయికి చేరాయి. సోమవారం రాత్రి 9 గంటలకు గాలిలోని ఎన్‌ఓ2 21 పిపిబికి, రాత్రి 10 గంటలకు 23 పిపిబికి చేరుకుంది. 24 గంటల్లో 19 గంటలు డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాల కంటే అధిక మోతాదులో నమోదైంది.



సోమవారం వాయు కాలుష్యం ఇలా..

వాయువు	ఉండాల్సినది	నమోదైనది
పిఎం 2.5 (మైక్రో గ్రాముల్లో)	30 లోపు	152
పిఎం 10 (మైక్రో గ్రాముల్లో)	50 లోపు	181
ఎన్‌ఓ2 (పిపిబిల్లో)	13.29 లోపు	23
గాలి నాణ్యత సూచి	50 లోపు	321

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- మంత్రి టిజి భరత్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెసి నూరుల్ కమర్
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం మన భాధ్యత అని, వారి త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జెసి నూరల్ కమర్‌లు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో అమరవీరుల స్తూపం వద్ద స్మృతి పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎస్పీ, జెసిలు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. అమరవీరుల త్యాగాలను ఎప్పటికి మరచిపోలేమన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం అంతటిలో ఏ త్యాగం లేదన్నారు. ఏ సంఘటన జరిగినా గుర్తుకొచ్చేది మొదటగా పోలీసులే అన్నారు. మానవ జీవనంలో పోలీసు వ్యవస్థ ఒక భాగంగా మారిందన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవడం మన బాధ్యత అన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... పోలీసు వ్యవస్థలో పని చేయడం చాలా కష్టతరమన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు, వివిఐపిలు, ఉత్సవాలు, పండుగలు, వివిధ రకాల బందోబస్తులు నిర్వహిస్తుంటారన్నారు. ప్రజల ధన, మాన , ప్రాణాలను కాపాడటంలో ఎటువంటి సంకోచం లేకుండా పోలీసులు ముందుకు వెళతారన్నారు. అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకోవడం, అమరులకు నివాళులు అర్పించడం మనందరి భాధ్యత అన్నారు. అనంతరం దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 191 మంది పోలీసుల పేర్లను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా చదివి వినిపించారు. వారందరికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, నివాళులర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అమర వీరుల (యుడి వెంకటేశ్వర్లు, అబ్దుల్ కరీం, కె.రాముడు) కుటుంబాలు వారిని శాలువా, పూలమాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, హోంగార్డు కమాండెంట్ నరసింహ రీజియన్ ఎం.మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డిఎస్పీలు బాబు ప్రసాద్, ఉపేంద్రబాబు, పోలీసు వెల్ఫేర్ డాక్టర్ ప్రవంతి, సిఐలు, ఆర్ఐలు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి టీజీ భరత్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్ దేశాయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామంలో ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతుల పొలాలను డి.గౌస్‌దేశాయ్‌తోపాటు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్ మధుసూదన్, కెవిపిఎస్ మండల నాయకులు రామకృష్ణ, భూ నిర్వాసితుల కమిటీ కన్వీనర్ రవికుమార్‌ల ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఏపిఐఐసిలో భూములు కోల్పోయిన చిన్న, సన్న కారు రైతుల గోడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఓర్వకల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు పాలకులు ప్రకటనలు గుప్పిస్తున్నారని తెలిపారు. కానీ పరిశ్రమల కోసం భూములు తీసుకుని, రైతులకు మాత్రం ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఏపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు, వృత్తిదారులకు పునరావాసం కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఆ భూముల్లో జరుగుతున్న నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల కమిటీ కో కన్వీనర్ వెంకటేశ్వర్లు, నారాయణ, వీరనారాయణ, చిన్న స్వాములు, లక్ష్మన్న, సుజాతమ్మ, సుబ్బమ్మ, బ్రహ్మాస్, కృష్ణ, గోవిందు, నారాయణ, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్



భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తి

- కలెక్టర్ డాక్టర ఎ.సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఏపిఐఐసి జెడ్‌ఎంను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఏపిఐఐసి ప్రాజెక్టులు, భూసేకరణ అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు చేపడుతున్న నీటి సరఫరా పైప్ లైన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 3 కిలోమీటర్ల మేర భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు సంబంధించి అడ్వాన్స్ పొజిషన్ కోసం ఫైల్ సర్కులేషన్ చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. డ్రోన్ సిటీకి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి పెగ్ మార్కింగ్ చేయాలని ఏపిఐఐసి జెడ్‌ఎంను ఆదేశించారు. ఇతర ప్రాజెక్టులకు సంబంధించి కూడా పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఒ సందీప్ కుమార్, ఏపిఐఐసి జెడ్‌ఎం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిరి

ట్రంప్ సుంకాలపై మోడీ మౌనం వీడాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న అధిక సుంకాలపై ప్రధాని మోడీ మౌనం వీడి మాట్లాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. భారతదేశ ప్రజలకు, రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ మంగళవారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో వ్యకాసం ఆధ్వర్యంలో ట్రంపు దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి కె.మధు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవి నారాయణ మాట్లాడుతూ భారత దేశ రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు, కార్మికులకు నష్టం కలిగించే ట్రంపు సుంకాలకు ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. దేశంలో పండించే ఆహార, వాణిజ్య పంటలు అమెరికాకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నామన్నారు. మన పాలకుల విధానాల వల్ల, ట్రంపు విధానాల వల్ల భారత దేశ ప్రజలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. ముఖ్యంగా పత్తి, రొయ్యలు, ఆహార ధాన్యాల పంటలపై ట్రంపు సుంకాల ప్రభావం పడుతుందన్నారు. ట్రంపు విధిస్తున్న అధిక సుంకాలను వెనక్కి తీసుకునే వరకు భారతదేశ రైతాంగం, వ్యవసాయ కార్మికులతో కలిసి ఐక్యంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. భారత ప్రధాని మోడీ ట్రంపు సుంకాల విషయంలో జోక్యం చేసుకొని తిరుగుబాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, పూలరంగడు, ఎల్లా రాముడు, వెంకట రాముడు, అంజి తదితరులు పాల్గొన్నారు. **కర్నూలు క్రైమ్ :** భారతదేశం పై డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న భారీ సుంకాలను వ్యతిరేకిస్తూ నరేంద్ర మోడీ మౌనం వీడాలని నిరసిస్తూ కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, డివైఎఫ్‌ఐ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ట్రంప్ ఫోటోలను దహనం చేశారు. డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా రైతు సంఘం నాయకులు మద్దిలేటి మాట్లాడారు. ట్రంపు భారీ సుంకాల వలన వ్యవసాయ రంగం,పాడి పరిశ్రమ దేశ యువతపై తీవ్రమైన ప్రభావం చూపుతాయనిఆందోళన చేశారు. ట్రంప్ సుంకాల పై నరేంద్ర మోడీ నోరు విప్పాలని బదులుగా గట్టి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నాయకులు అంజి,వేణు,ప్రకాష్,కిషన్ రైతు సంఘం నాయకులు వెంకటేష్, సుధాకర్, హుసేనాలం, అల్లా బకాస్, ఎల్లప్ప, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఉలిందకొండలో ట్రంప్ ఫొటోలను దహనం చేస్తున్న నాయకులు



ఉల్చాలలో ట్రంప్ ఫొటోలను దహనం చేస్తున్న నాయకులు

కుల నిర్మూలనకు పోరాటం

- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలనకు పోరాడదామని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో కెవిపిఎస్ జెండాను జాన్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1998 అక్టోబర్ 2న కెవిపిఎస్ ఏర్పడిందని, నాటి నుంచి ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రభుత్వ అధికారుల ను, ప్రజా ప్రతినిధులను కదిలించే విధంగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేట్ పరం చేసి రిజర్వేషన్లు అమలు కాకుండా కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రయివేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం గా దళితులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కెవిపిఎస్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్, నగర అధ్యక్షులు జి.ఏసు, నగర ఉపాధ్యక్షులు ఆర్.నరసింహులు, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.శ్యామల, ఐద్వా రాష్ట్ర నాయకులు ఎ.అలివేలు, కెవిపిఎస్ జిల్లా నాయకులు పెద్దబాబు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

పోలీసు అమరవీరులను స్మరించుకోవాలి

- డీఎస్పీ వెంకట్రామయ్య


ప్రజాశక్తి - పత్తికొండ

విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకోవాలని డీఎస్పి వెంకట్రామయ్య పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ పోలీసు స్టేషన్‌లో అర్బన్ సిఐ జయన్న ఆధ్వర్యంలో అమరవీరుల సంస్కరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ వెంకటరామయ్య పాల్గొని అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ సరిహద్దులో ఆర్మీ జవాన్లు ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేస్తున్నారని తెలిపారు. దేశ ప్రజల కోసం ఆర్మీ జవాన్లు, పోలీసులు చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు.

దాతకు గ్రామస్తుల సన్మానం

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని గుంటుపల్లి గ్రామంలో ఎంపిపి పాఠశాల అభివృద్ధికి సహకరించిన టిడిపి నాయకులు ఈదుల వెంకట్రాముడును గ్రామస్తులు సన్మానించారు. వెంకట్రాముడు తన సొంత ఖర్చులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. మంగళవారం ఆయనను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యా కమిటీ ఛైర్మన్ సుధాకర్, జుట్ల వెంకట శేషిరెడ్డి, వల్లపు శేషన్న, డి.శివ నారాయణ, డి.నారాయణ, సలీంద్ర కృష్ణ, జమ్మి చెట్టు శీను, గోగుల సుంకన్న, గొట్టిపాటి జయరాముడు, వల్లపు మోహన్, వల్లపు చంద్ర, ఆటో సూరి, బూత్ ఇన్‌ఛార్జి విజయ రాజశేఖర్ పాల్గొన్నారు.



దాతను సన్మానిస్తున్న గ్రామస్తులు

రైతుల భూములు లాక్కోవద్దు

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ కోసం సారవంతమైన భూములు లాక్కోవద్దని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ, రైతుసంఘం జిల్లా నాయకులు పి.హనుమంతు పాల్గొని మాట్లాడారు. మనేకుర్తి గ్రామంలో రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గ్రామంలో సాగు భూములు తక్కువగా ఉన్నా ఇంకుడు గుంతల ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌తో ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నారని చెప్పారు. సారవంతమైన భూములను పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రభుత్వ సహకారంతో పవర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుందన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడిన పత్రిక ప్రకటనలో 74 మంది రైతుల నుంచి 192 ఎకరాల భూసేకరణ చేస్తున్నట్లు 2025 ఆగస్టు 25న ప్రాథమిక ప్రకటన ఇచ్చారన్నారు. గ్రామంలో తహశీల్దార్, ఆర్‌డిఒ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో రైతులందరూ సాగుభూములను ఇవ్వబోమని తేల్చిచెప్పారని తెలిపారు. పవర్ గ్రిడ్ వారు రైతులకు ఫోన్లు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రైతుల నుంచి బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించారు. రైతుసంఘం జిల్లా నాయకులు కోటకొండ సూరి, ఆంజనేయులు, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, మనేకుర్తి రైతులు పాల్గొన్నారు.

వెముగోడులో ఆర్‌ఎస్‌కె కొనసాగించాలి

గోనెగండ్ల మండలం వెముగోడు గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని కొనసాగించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. రామకృష్ణ, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.హనుమంతు, జిల్లా నాయకులు, గొందిపర్ల మాజీ సర్పంచి జి.ఆంజనేయులు, ఈ.తాంద్రపాడు సర్పంచి బాలపీరా మాట్లాడుతూ... అత్యధిక జనాభా కలిగిన వెముగోడు గ్రామం నుంచి ఆర్‌ఎస్‌కెను పుట్టపాశం గ్రామానికి తరలించడం అన్యాయమన్నారు. కలెక్టర్ స్పందించి వెముగోడులోనే కొనసాగించేటట్లు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహబూబ్ బాషా, గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జిల్లాలో వలసలను నివారించాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా నివారించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లాలో రైతులు మిశ్రమ పంటలను సాగు చేయాలని తెలిపారు. ఉల్లి ప్రాసెసింగ్, టమోటా ప్రాసెసింగ్ యూనిట్లను పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు మేకలు, గొర్రెలు, గేదెల కోసం రుణ సౌకర్యం కల్పించి, పాల ఉత్పత్తి పెరిగే విధంగా చర్యలు తీసుకొని వాటి ద్వారా వారికి ఆదాయం సమకూర్చే చర్యలు తీసుకోవాలన్నారు. జెసి నూరుల్ కమర్, డిఆర్‌డిఎ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, పశుసంవర్థక శాఖ జెడి శ్రీనివాసులు, హార్టికల్చర్ ఎడి.రాజ కృష్ణారెడ్డి, సెరికల్చర్ ఎడి ఆంజనేయులు, మార్క్‌ఫెడ్ డిఎం గద్వాల రాజు, మార్కెట్ యార్డ్ ఎడి నారాయణమూర్తి, ఫిషరీస్ డిడి రంగనాథరావు, అగ్రికల్చర్ ఎడి రాజశేఖర్, నాబార్డ్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఎల్‌డిఎం రామచంద్ర రావు పాల్గొన్నారు.

ఆంగ్ల భాష నైపుణ్యం తప్పనిసరి


ప్రాథమిక స్థాయిలోనే ఆంగ్ల భాషపై నైపుణ్యం తప్పనిసరి అని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం డిఇఒ ఎస్.శ్యామ్యూల్ పాల్‌తో కలిసి విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రాథమిక విద్యలోనే ఆంగ్ల భాష నైపుణ్యాలను విద్యార్థులకు అందించేందుకు జిల్లావ్యాప్తంగా 20 మంది రిసోర్స్ పర్సన్లను నియమించాలని, 20 మందికి రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్లతో శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. వెంటనే ప్రణాళిక కార్యాచరణ రూపొందించాలని, తక్షణమే అమల్లోకి రావాలని తెలిపారు. ఆంగ్లం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పాలని, ఈ పోటీ ప్రపంచంలో తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లాలో విద్యాభివృద్ధికి నిర్ణయాత్మక, నిర్మాణాత్మక కృషి జరగాలని, ఈ దిశగా విద్యాశాఖ యంత్రాంగం కృషి చేయాలని కోరారు.

11 గంటలైనా తెరచుకోని సచివాలయాలు

- మండల కేంద్రంలోనే ఇలా.. గ్రామాల్లో ఎలానో మరి
- అధికారుల కోసం ప్రజల ఎదురు చూపులు

ప్రజాశక్తి - సి బెళగల్

సచివాలయం ఉద్యోగులు వేళలు పాటించడంలో ఇస్తారాజ్యమైంది. పట్టించుకొనేనాధులు లేక అడిగే వారు కానరాక ఉదయం సమయం పదకొండుయినా సచివాలయాలు తెరుచుకోవడం లేదు. ఫలితంగా సంబందించిన అధికారులతో, సిబ్బందితో సేవలు పొందెందుకు ప్రజలు కార్యాలయాల వద్దకు వచ్చి రాక కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకు నిదర్శనంగా మంగళవారం మండల కేంద్రంలోనీ సచివాలయం-1,2 కార్యాల యాలు దర్శనమిచ్చాయి. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎలానో మరీ.. అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, పలువురికి అవసరమైన సేవలు ఈ కేంద్రాలలోనే పొందుకోవాలి. ఒక్కో కేంద్రంలో 6 నుండి 11 మంది వరకు ఉద్యోగులు సేవలు అందించాల్సి ఉంది. మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విధుల్లో ఇష్టారాజ్యమయిందని వార్తలు వినిపిస్తున్నాయి. వేళకు రాకుండా వేళ కాకుండానే వెళ్లిపోతున్నారని సమాచారం. ఇక విధుల్లో కొద్దీ గంటలు మాత్రమే ఉన్నప్పటికి ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు పని తప్పించుకోవడానికి సర్వర్ సమస్యలు అంటూ ప్రదర్శిస్తున్నారు. మరీ కొన్ని కేంద్రాలలో ఈ పని చేయించుకోవడం మా వద్ద కాదని మండల స్థాయి కార్యాలయంలోకే వెళ్లాలంటూ అటు ఇటు తిప్పుతున్నారు. ఇప్పటికైనా విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు ప్రజలకు సులువైన సేవలు అందించేందుకు అధికారఘనం క్షేత్రస్థాయిలో దృష్టి సారించాలని ప్రజాసంఘాలు, పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.





దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ట్రంప్ సుంకాల భారాన్ని వ్యతిరేకించండి

- ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - పత్తికొండ

భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేస్తున్న సుంకాల భారాన్ని వ్యతిరేకించాలని నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ట్రంప్ వ్యతిరేక విధానాలపై రైతు సంఘం మండల కార్యదర్శి సిద్ధయ్య గౌడ్ ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు రంగారెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలిసి ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు మధు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పి.ఖాసీం, వ్యకాస మండల నాయకులు దస్తగిరి, సురేంద్ర, డివైఎఫ్‌ఐ మండల అధ్యక్షులు దూదేకొండ కోడం దుగ్గెన్న పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బండి మెట్టలోని సామూహిక మరుగుదొడ్లను మరమ్మతులు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు డి పార్వతయ్య, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్‌ఎండి షరీఫ్ నగరపాలక సంస్థ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. ఇంటింటికి సిపిఎం ప్రజల వద్దకు సిపిఎం అనే కార్యక్రమంలో భాగంగా బండిమెట్టలో సిపిఎం ప్రతినిధి బృందం సమస్యలు తెలుసుకుంది. ప్రజలు నాయకుల దృష్టికి అనేక రకాల సమస్యలు తీసుకొచ్చారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి, అక్కడ మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వారు నాయకులకు తెలియజేశారు. వార్డులలో పెరిగిన జనాభాకనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేరని వారానికి రెండుసార్లు వచ్చి కాలువ తీయావల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు వివరించారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ నాయకులతోపాటు పాలకమండలి నగరపాలక సంస్థ అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. కర్నూలు నగరంలో గోడలకు రంగులు వేయడం తప్ప ప్రజల సమస్యల అభివద్ధి కోసం చిత్తశుద్ధి కనపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు శాలి భాష, బాబులి, హాజీ బాష, నూర్ బాషా, షాయిద్, షాష వలి, గౌస్ బాషా, సయ్యద్ అలీ, పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

ప్లాస్టిక్ నిషేధంలో తండా ఆదర్శం : డీఎస్పీ

ప్రజాశక్తి - మంత్రాలయం



డీఎస్పీ భార్గవిని సన్మానిస్తున్న సభ్యులు

ప్లాస్టిక్ నిషేధం నిర్ణయంతో మాధవరం తండా గ్రామం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మిగనూరు డివిజన్ డీఎస్పీ భార్గవి ప్రశంసించారు. మంగళవారం మండలంలోని ఎం.తండా గ్రామానికి చెందిన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన '5కె రన్'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ఒక మారుమూల గ్రామం నుంచి సుమారు 40 మంది ఉద్యోగులు సొంత ఊరు అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ సొంత నిధులతో గ్రామస్తులతో కలిసి ప్రతి దీపావళి పండగకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. గతేడాది పచ్చిదనం, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వగా ఈ ఏడాది కాన్సర్‌పై అవగాహన, ప్లాస్టిక్ నిషేధంపై తీసుకున్న నిర్ణయం స్ఫూర్తి దాయకమని చెప్పారు. అనంతరం ఆమెకు, సిఐ రామాంజులుకు శాలువా, మెమెంటో అందజేసి సన్మానించారు. ఉద్యోగులు సంఘం నాయకులు మహేంద్ర మాట్లాడుతూ... ఉద్యోగులు జీతంలో కొంత ఖర్చు చేసి గ్రామంలో విద్యార్థులకు ట్యూషన్ చెప్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ లైట్లు, పారిశుధ్యం, ఆరోగ్యం, పచ్చదనం వంటి విషయాల్లో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

ములుగుందంలో రోడ్లపై డ్రెయినేజీ నీరు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి


మురుగునీటిలో నాట్లు వేస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని ములుగుందం గ్రామంలో డ్రెయినేజీ కాలువలు లేక నీరు రోడ్లపై నిలుస్తోందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ మండి పడ్డారు. మంగళవారం ములుగుందంలో నిల్వ ఉన్న మురుగు నీటిలో నాట్లు వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లపై నీళ్లు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. గ్రామంలో ఏ కాలనీకి వెళ్లినా ఇదే దుస్థితి ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువలు నిర్మించి మురుగు నీరు కాలువలో వెళ్లేలా చూడాలని కోరారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. లేకపోతే ప్రజలతో కలిసి సచివాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు గురుస్వామి, నరసింహులు, రాజేష్, దస్తగిరి, రంగస్వామి పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు వెలకట్టలేనివి

- సిఐ విజయ భాస్కర్

ప్రజాశక్తి- గోనెగండ్ల


పోలీసు అమర వీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలు వెలకట్టలేనివని గోనెగండ్ల సిఐ విజయభాస్కర్ తెలిపారు. సోమవారం జాతీయ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోనెగండ్ల పోలీసు స్టేషన్‌లో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోని భూభాగాన్ని కాపాడేందుకు, దేశ ప్రజల రక్షణలో భాగంగా ఎంతోమంది పోలీసు, మిలిటరీ, పారా మిలిటరీ సిబ్బంది ప్రాణాలర్పించి అమరవీరులుగా నిలిచిపోయారని తెలిపారు. ట్రెయినీ ఎస్ఐ అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ యూసుఫ్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

- రూ.80 వేల నష్టం

ప్రజాశక్తి - ఆస్పరి


పొలం గట్టున మృతి చెందిన ఎద్దు

మండలంలోని తంగరడోన గ్రామంలో పిడుగుపాటుకు గురయి రైతు ఉమాపతికి చెందిన ఎద్దు మృతి చెందింది. మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పొలంగట్టున గడ్డి మేస్తుండగా పిడుగు పడి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.80 వేల విలువ చేసే ఎద్దు చనిపోయిందని రైతు వాపోయారు. వ్యవసాయంలో రైతుకు అండగా ఉన్న ఎద్దు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని గ్రామస్తులు కోరారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..!

- అధికారుల్లేక బోసిపోతున్న సచివాలయాలు
- అసంతృప్తితో వెనుదిరిగి వెళ్తున్న అర్జీదారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

సచివాలయాల్లో అధికారులు లేక ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. గ్రామాల్లోని సచివాలయాల్లో పని చేసే సిబ్బంది వారికి అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. అధికారులు కూడా ఇబ్బందులు చూడకుండా వారు అడిగిన ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేసే సిబ్బంది వస్తున్నారా, లేదా అని కూడా అధికారులు చూడడం లేదు. సిబ్బంది లేక అర్జీదారులు అసంతృప్తితో వెనుదిరిగిపోతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గత ప్రభుత్వం సచివాలయాలను నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. అందుకు అనుగుణంగా సచివాలయాల్లో ఏ శాఖకు సంబంధించి అధికారులు ఆ శాఖకు నియమించి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం తోడ్పాటునిచ్చింది. గత ప్రభుత్వంలో సచివాలయాల్లో విధులు నిర్వర్తించిన అధికారులను కూటమి ప్రభుత్వంలో బదిలీ చేయడంతో అధికారులు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను చూసుకొని వెళ్లారు. చిప్పగిరి మండలంలో 9 సచివాలయాల్లో బదిలీలు జరగకముందు 90 మంది అధికారులు విధులు నిర్వర్తించేవారని మండల అధికారులు తెలుపుతున్నారు. బదిలీల నేపథ్యంలో మండలంలోని సచివాలయ అధికారులంతా ఇక్కడి నుంచి వెళ్లారు. ఇక్కడకు వచ్చే అధికారులు మాత్రం లేరు. 90 మంది అధికారులకు గాను కేవలం 53 మంది మాత్రమే ఇప్పటికీ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. 37 మంది అధికారులు లేక సచివాలయాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అర్జీదారులు వచ్చి అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెళ్లిపోతున్నారు. కనీసం సచివాలయాల్లో తప్పనిసరిగా ఉండే డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తోనే ఎక్కువ పనులు జరుగుతుంటాయి. సచివాలయాల్లో వీరు లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రభుత్వం చెప్పిన సర్వేలను కూడా కొద్ది వరకు వెనుకబడి పోతున్నామని మండల అధికారులు చెబుతున్నారు. మండలానికి బదిలీపై వచ్చిన ఆరుగురికి కూడా ప్రమోషన్ రావడంతో వెళ్లిపోయారు. 9 సచివాలయాలకు గాను కేవలం ఇద్దరు మాత్రమే డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు. 9 సచివాలయాల్లోనూ ఎక్కడా పూర్తి సిబ్బంది లేక ముగ్గురు, నలుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. నేమకల్లు సచివాలయంలో ఐదుగురు అధికారులు లేరు. ఏరూరులో నలుగురు అధికారులు లేరు. ప్రతి సచివాలయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. సమస్యలను మండల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే అధికారులు వచ్చేటట్లు చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సచివాలయాల్లో అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

దరఖాస్తులు తీసుకునే వారూ లేరు

- భాస్కర్, చిప్పగిరి



సమస్యలపై సచివాలయాల్లో దరఖాస్తులు ఇవ్వడానికి వెళితే అధికారులు లేక వెనదిరగాల్సి వస్తోంది. మా రేషన్ కార్డులో పిల్లలను చేర్చాలని సచివాలయంలో అడిగితే.. సిబ్బంది లేరు. నెల తర్వాత రావాలి' అని అంటున్నారు. ఇదే పరిస్థితి మండలంలోని ప్రతి సచివాలయంలో ఉంది. అధికారులు వెంటనే సచివాలయ కార్యాలయాలకు అధికారులను వేయాలి.

ఉన్నతాధికారులకు సమాచారమిస్తాం

- ఎంపిడిఒ అల్లా బకాష్



సచివాలయాల్లో సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చిన కొన్ని సర్వేలను పూర్తి చేయలేకపోతున్నాం. సచివాలయాల్లో పూర్తి సిబ్బంది లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కొంతమంది అర్జీదారులు మండల కార్యాలయానికి తిరుగుతున్నారు. వచ్చిన ఆరుగురు అధికారులకు కూడా ప్రమోషన్ రావడంతో వెళ్లిపోయారు. సచివాలయాలకు పూర్తి సిబ్బంది వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు కూడా ఈ సమాచారం అందిస్తాం.

దీపావళి వేడుకలో ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి మంత్రాలయం


బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే దంపతులు

దీపావళి పండగ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు బాణ సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సోమవారం దీపావళి పండగ నేపథ్యంలో ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో సతీమణి, కాచాపురం సర్పంచి జయమ్మతో కలిసి దీపాల కాంతుల మధ్య బాణసంచా కాల్చారు. ఆయన మాట్లాడుతూ... ప్రతిఒక్కరి జీవితంలో చీకటి, వెలుగులు సహజమని, దీపం జ్ఞానానికి ప్రతీక అని తెలిపారు. డాక్టర్స్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు దశరథ రెడ్డి పేర్కొన్నారు.

ప్రతి ఇంట్లోనూ వెలుగులు నిండాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి ఇంట్లోనూ దీపావళి వెలుగులు వెలగాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. దీపావళి పండగ అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు తీసుకురావాలని తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చారు. సతీమణి బి.రామాంజినమ్మ, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ బి.చంద్రశేఖర్, కుమార్తె, అల్లుడు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

భోగేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

భోగేశ్వర దేవాలయంలో స్వామివారికి జలాభిషేకాలు, సుప్రభాత సేవ, కుంకుమార్చన, మహా మంగళహారతి, ఇతర అర్చన, ప్రత్యేక పూజలను పూజారులు నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాళమల్లేశ్వరులకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - హోళగుంద : మండలంలోని దేవరగట్టు కొండ గుహల్లో వెలసిన శ్రీమాళ మల్లేశ్వర సన్నిధిలో దీపావళి, కార్తీక అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో శ్రీమాళమల్లేశ్వరులను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. అర్చకులు పంపాస్వామి, మహేష్ స్వాములు బిల్వార్చన, కుంకుమార్చన, బండారు అర్చన, ఆకు పూజలు చేశారు. భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పైపులైను పనులు పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని చిన్నహరివాణం దగ్గర నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు నుంచి పెద్దహరివాణం, సంతేకుడ్లూరు గ్రామాలకు వెంటనే పైపులైన్ వేయాలని, కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి పాండవగల్ వరకు అదనపు పైపులైన్ వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు కోరారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి కుప్పగల్, చిన్నహరివాణం ఎస్ఎస్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నహరివాణం దగ్గర ఎస్ఎస్ ట్యాంకును ప్రారంభించి రెండేళ్లవుతున్నా పెద్దహరివాణం, సంతేకుడ్లూరు గ్రామాలకు నేటికీ పైపులైన్ వేయలేదని తెలిపారు. తక్షణమే ఆ రెండు గ్రామాలకు పైపులైన్ వేసి ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి పాండవగల్ గ్రామం వరకు అదనపు పైపులైన్ వేయాలని, మైక్రో ఫిల్టర్ తొలగించి ఫిల్టర్ బెడ్లను కొత్తగా ఏర్పాటు చేసి శుద్ధి చేసిన తాగునీరు అందించాలని కోరారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగు, తాగునీటి సమస్యపై ఈనెల 23న ఆదోనిలో సదస్సు నిర్వహిస్తున్నామని, ఆయా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వీరారెడ్డి, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు అయ్యన్న, నాయకులు లక్ష్మన్న, శాఖ కార్యదర్శి గోవిందు, పార్టీ సభ్యులు హనుమంతు రెడ్డి, రమేష్, హుస్సేని పాల్గొన్నారు.



ఎస్ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

ట్రంప్ సుంకాలను వ్యతిరేకించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-ఆలూరు

దేశంలోని ఆక్వా, పత్తి, పౌల్ట్రీ, పాడి పరిశ్రమలపై అధికంగా సుంకాలు పెంచిన ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించి.. వాటిని రక్షించుకునే బాధ్యత ప్రధాని మోడీ తీసుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ దగ్గర, కురవల్లి గ్రామంలో మండల కార్యదర్శి యు.ఈరన్న అధ్యక్షతన ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హనుమంతు ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ టారీఫ్‌ల పేరుతో రైతాంగాన్ని కుదేలు చేస్తున్నా భారత ప్రధాని మోడీ కనీసం స్పందించడం లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పారిశ్రామిక సంఘాలతో చర్చలు జరిపి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం ప్రకటించిందని, ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెప్పారని అన్నారు. కార్మికులు, రైతులు, ఇతర వృత్తుల వారితో చర్చించి అన్ని వర్గాలకు మేలు చేసే ప్రోత్సాక పథకాలు ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు అంజి, నారాయణ, వెంకటేష్, రవి, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు. **ఆస్పరితో** పాటు కైరుప్పల, ములుగుందం, వలగొండలో సిపిఎం ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, సిఐటియు నాయకులు విఠల్, రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి, వ్యకాస నాయకులు రామాంజినేయులు, నాగరాజు, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు శేషప్ప పాల్గొన్నారు.


ఆలూరులో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


ఆస్పరిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


రబీ పంటకు నీరందిస్తాం : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నియోజకవర్గంలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల రైతులకు రబీ పంటకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం రబీ పంటకు సాగునీటిపై ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే వివిధ మండలాల నాయకులు, రైతులతో సలహాలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... రైతులు నీటి లభ్యత తక్కువ వాడుకునే పంటలను సాగు చేయాలని కోరారు. ఆయకట్టు ద్వారా అన్ని ప్రాంతాలకు నీటి సౌకర్యం ఉన్నా, నియాజకరవర్గ వ్యాప్తిగా కొన్ని ప్రాంతాలకు నీళ్ల ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. వాటికి కూడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సాగు నీరు అందేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. మొత్తం కలిపి వేయి ఎకరాలు ఉన్నాయని, వాటికి ఎల్ఎల్‌సి ద్వారా నీరందిస్తామని తెలిపారు. రబీ సీజన్‌లో ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా చూసుకుంటామని చెప్పారు. మండల అధ్యక్షులు కెటి.వెంకటేష్, టిడిపి నందవరం మండల అధ్యక్షులు ఖాసీం వలీ, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు నాయకులు నారాయణరెడ్డి, గురునాథ్ రెడ్డి, ధర్మపురం గోపాల్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి కూటమి అండ

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీవీ తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 26 మంది బాధితులకు రూ.9.68 లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడుతున్న పేదలకు సిఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మహేష్, పట్టణ కోశాధికారి విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు రంగస్వామి గౌడ్, రామకృష్ణ, కలీముల్లా, పట్టణ నాయకులు మహేంద్ర, బందే నవాజ్, మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

సమాచార హక్కు చట్టానికి తూట్లు..

- ఫోరం ఫర్ ఆర్‌టిఐ జిల్లా లీగల్ సెల్ సలహా దారులు విజయ కుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం



సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ ఆర్‌టిఐ జిల్లా లీగల్ సెల్ సలహాదారులు విజయ కుమార్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం కింద సమాచారం అడగ్గా రెవెన్యూ అధికారులు సరైన సమాచారం ఇవ్వలేదని, అందుకే రెవెన్యూ అధికారులపై అప్పీల్‌కు వెళ్లినట్లు చెప్పారు. గత నెలలో రీ సర్వే, ఇతర సమస్యలపై ఆర్‌టిఐ ద్వారా మంత్రాలయం తహశీల్దార్ కార్యాలయ అధికారులను సమాచారం కోరగా గత మూడు రోజుల క్రితం విఆర్ఓ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. అసంపూర్తి సమాచారం ఇచ్చారని అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు నిర్లక్ష్యం, అవగాహన లోపంతో సరైన సమాచారం ఇవ్వడం లేదని విమర్శించారు. సరైన సమాచారం ఇవ్వనందుకు ఆదోని ఇన్‌ఛార్జీ సబ్ కలెక్టర్‌కు మొదటి అప్పీల్ చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సోదరుని మృతి

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు పాటిల్ శేషి రెడ్డి సోదరుడు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పాటిల్ సూర్య నారాయణ రెడ్డి (83) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి గ్రామ పెద్దలు, గ్రామస్తులు నివాళులర్పించారు. గ్రామంలో ఎనలేని సేవలు అందించారని పలువురు కొనియాడారు. సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కీర్తిశేషులు శివభూషణ్ రెడ్డి కుమారుడు పాటిల్ తిరుమల రెడ్డి, ఎంపిటిసి నామాల శ్రీను, మాజీ ఎంపిటిసి కురువ ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, పాలక్షి రెడ్డి, కోటి రెడ్డి, వైసిపి నాయుకులు ఏసేపు, నాగరాజు, మేఘన్న, ధనుంజయ్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న తెర్నేకల్ గ్రామస్తులు

ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని తుంగభద్ర రైల్వే (మంత్రాలయం రోడ్డు, ఆర్ఎస్) స్టేషన్‌లో కదులుతున్న రైలును ఎక్కబోయి ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందినట్లు ఆదోని రైల్వే స్టేషన్ ఎస్ఐ గోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రం విరుద్ నగర్ జిల్లా ముతుసమియపురం మండలానికి చెందిన ఎ.పాల్ రాజ్ రైలు ఎక్కపోయి కిందపడ్డారని తెలిపారు. గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. అతని వద్ద సోలాపూర్ నుంచి మదురై వరకు టికెట్ ఉందని, బతుకుదెరువు కోసం వెళ్లి ఊరికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగినట్లు చెప్పారు. మృతునికి భార్య కామాక్షి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న రామచంద్ర నాయుడు

జ్యోతిపై విమర్శలు విడ్డూరం

- మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు


ప్రజాశక్తి- దేవనకొండ

ఆలూరు ప్రాంతాభివృద్ధిపై ఎమ్మెల్యే బి.విరుపాక్షి అసెంబ్లీలో చర్చించేలా వైసిపి నాయకులు ప్రయత్నం చేయాలని, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, కాకర్ల శాంతి కుమార్, వెలమకూర్ సర్పంచి భాస్కర్ విమర్శించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి నాయకులు బీసీలపై కపట ప్రేమ నటిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన ప్రధానమంత్రి పర్యటనలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతిపత్రం ఇచ్చినట్లు ఎమ్మెల్యే ప్రకటించారని, ప్రధానమంత్రిని కలిసినట్లు ఎక్కడా కనిపించలేదని వైకుంఠం జ్యోతి ముక్కు సూటిగా ప్రశ్నించారని తెలిపారు. వాల్మీకులను ఎస్టీ జాబితా చేర్చడం టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. బీసీలను విభజించి వైసిపి నాయకులు వైకుంఠం జ్యోతిపై విమర్శలు చేయడం తగదన్నారు. టిడిపి నాయకులు రామారావు నాయుడు, మల్లయ్య, ఆకుల వీరేష్, రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్, బండపల్లి శ్రీనివాసులు, పొట్లపాడు వెంకటేష్ పాల్గొన్నారు.

సీమ రైతుల కన్నీటి గాథ 'పెన్నేటి పాట'

- అరసం జిల్లా అధ్యక్షులు ప్రహ్లాద్

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న నాయకులు

రాయలసీమ గ్రామీణ జీవితానికి నిలువుటద్దం విధ్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' కావ్యమని, ఈ కావ్యం సీమ రైతుల కన్నీటి గాథ అని డాక్టర్ హరికిషన్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కలం ప్రహ్లాద్ తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రహ్లాద్ అధ్యక్షతన మంగళశారం అక్షరశ్రీ జూనియర్ కళాశాలలో జరిగిన విధ్వాన్ విశ్వం జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కరువు, వలసలు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో పాలకుల నిర్లక్ష్యం నేటికీ కొనసాగడం విచారకరమని తెలిపారు. ముందుగా పత్రిక సంపాదకుడు, రచయిత, కళా ప్రపూర్ణ విధ్వాన్ విశ్వం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు పండితుడు కెసి.మల్లికార్జున, అరసం డివిజన్ నాయకులు నాగన్న, అక్షరశ్రీ అధ్యాపకులు సిద్ధార్థ, ఉజ్వల మిత్రమండలి నాయకులు దశరథ రాముడు, కేశవ, బ్యాంకు రవి పాల్గొన్నారు.

కరువు భత్యానికి 'కూటమి' కొత్త భాష్యం : ఎంటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా ప్రకటించాల్సిన కరువు భత్యంపై కూటమి ప్రభుత్వం కొత్త భాష్యం చెప్పడం విడ్డూరంగా ఉందని ఎపి ఎంటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డిఆర్.గోపాల్ రెడ్డి, వి.సురేష్ కుమార్ విమర్శించారు. మంగళవారం ఆదోని మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో వారు మాట్లాడారు. ఏడేళ్ల తర్వాత డియర్నెస్ అలవెన్స్ మంజూరు అనే మాట వింటున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను చూసి సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. బకాయిలపై హామీ లేకపోవడంతో నిరాశకు గురయ్యారని చెప్పారు. ఉత్తర్వులు సవరించాలని డిమాండ్ చేశారు.

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి

- టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ

ప్రజాశక్తి - నందవరం

కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలి తెలిపారు. మంగళవారం టిడిపి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారి పోయిందని తెలిపారు. ఆర్థిక పరిస్థితిని సరిదిద్దుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా వేదికగా కొంతమంది వ్యక్తులు కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వారికి కనిపించటం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. ఎమ్మిగనూరు, కోడుమూరు చేనేతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి కృషితో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలను ప్రజలకు అందించేందుకు ఎమ్మెల్యే బీవీ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం డ్రోన్ల ఉపయోగం ఉండడంతో రూ.8 లక్షల సబ్సిడీతో ఎమ్మెల్యే రెండు డ్రోన్లు అందించినట్లు చెప్పారు. ప్రజల కోరిక మేరకు నందవరం మండలంలో నూతనంగా నాలుగు పంచాయతీలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, నాయకులు కోరడంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. టిడిపి నాయకులు రామకృష్ణా రెడ్డి, ఉదయ్ గౌడ్, సత్యారెడ్డి, సామ్యేల్, షరీఫ్, గోపాల్, సురేష్, శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ